క్లుప్తంగా

ఘనంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకున్న సర్పంచ్ అరుణ దంపతులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ బళ్ల గేటులో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్‌లోని వ్యాపారులంతా కలసి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు మూడు వేల మందికి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాంబాబు దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లాయర్ నారాయణరెడ్డి మృతి



నారాయణరెడ్డి (ఫైల్)

మండపేట: ఆలమూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేఆర్‌సీ నారాయణరెడ్డి (64) శనివారం కన్నుమూశారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో మృతి చెందారు. రెండేళ్ల క్రితం నారాయణరెడ్డి భార్య మృతి చెందారు. ఆమె కూడా న్యాయవాదిగా, ఆలమూరు ఏపీపీగా పని చేశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో నారాయణరెడ్డి టీడీపీలో పలు పదవులు చేపట్టారు. పేదలకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నపల్లి సత్యనారాయణ, హైకోర్టు న్యాయవాది టీవీ గోవిందరావు తదితరులు సంతాపం తెలిపారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

కాజులూరు: ప్రజల మెరుగైన ఆరోగ్యానికి పరిసరాల శుభ్రత కీలకమని గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు అన్నారు. శనివారం గ్రామంలో పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. పరిసరాల శుభ్రత, వ్యాధుల నిర్మూలన అనే అంశంపై సచివాలయ ఉద్యోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనీయుల ఆహారపు అలవాట్లు, పరిసరాల శుభ్రత లోపాల కారణంగానే కరోనా వ్యాధి విజృంభణకు కారణమైందన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు.

పంచాయతీల బలోపేతానికి కృషి

కపిలేశ్వరపురం: నూతన ప్రభుత్వం గ్రామ పంచాయతీల బలోపేతానికి కృషి చేస్తుందని కపిలేశ్వరపురం సర్పంచ్, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు సాకా శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్ ఆ దిశగా కృషి చేయాలని కోరారు.

మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొండాడ



బొండాడ రణదీప్ కుమార్

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన బొండాడ రణదీప్ కుమార్(టింకూ)ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజ్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బొండాడ మాట్లాడుతూ మాల మహానాడును మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

రాయవరం: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఎనిమిది గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. ఉరుములు, మెరుపులకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సుమారు గంటకు పైగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

గోశాలకు దాణా వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు మలికిపురానికి చెందిన విష్ణుభట్ల సుందర్రావు, సుబ్రహ్మణ్యం రూ.2 వేల విలువ చేసే 100 కేజీల దాణాను శనివారం వితరణ చేశారు. ఈ మేరకు గోశాల వద్ద అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో సిబ్బందికి అందజేశారు. సేవా బృందం సభ్యులు గునిశెట్టి శివ, రావి ప్రసాద్, నల్లా ప్రసాద్, జె.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

నాన్నకు ప్రేమతో...



- జీవిత గమనాన్ని నేర్పిన తండ్రి
- కుటుంబంతో పాటు సమాజానికి మార్గదర్శి
- నేడు ఫాదర్స్ డే

కపిలేశ్వరపురం: మనిషికి జన్మనిచ్చేది అమ్మయితే జీవిత గమనంలో నడకను నేర్పేది నాన్న. ఊపిరి ఊదిన అమ్మకు అండగా.. బిడ్డకు తోడూ నీడగా నిజజీవితంలో నిటారుగా నిలిచేది నాన్న. ఎవరెంత కీర్తిని అర్జించినా, ఎంత డబ్బు సంపాదించినా, ఎంతకాలం బతికినా దాని వెనుక నాన్న మార్గదర్శకత్వం దాగి ఉంటుంది. సినిమాల్లో మనం రీల్ హీరోనే చూస్తాం. కాని కష్టమొచ్చినప్పుడు నేనున్నా కన్నా అంటూ కనురెప్పలా కాపాడే నాన్నే నిజమైన హీరో. నాన్న పక్కనుంటే అదో ధైర్యం. ఆయనను చూస్తే కొండంత బలం. అంతటి ప్రాధాన్యం గల నాన్నను గుర్తించేందుకంటూ ఓ రోజు ఉంది. అదే ‘ఫాదర్స్ డే’. ఏటా జూన్ నెలలోని మూడో ఆదివారాన్ని ఫాదర్స్ డేగా జరుపుకుంటారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో నాన్నను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగిన ప్రముఖులెందరో ఉన్నారు. వారి మనోభావాలతో ఈ ప్రత్యేక కథనం...

జీవితంలో నాన్నే నాకు స్ఫూర్తి



నాన్నను జీవ సంబధితమైన బంధంగా మాత్రమే నేను చూడను. సమాజంలో నాన్న బంధం కొన్ని కార్యకలాపాలు, ఆశయాల, సామాజిక సంబంధంగా చూస్తాను. హోమియో వైద్యుడిగా, సాంస్కృతిక వేదిక నిర్వాహకునిగా పనిచేయడంలో నాన్నే నాకు స్ఫూర్తి. హోమియో వైద్యునిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ఏనాడూ నాన్న నాకు ఎలా చదవాలి, ఏమి చదవాలి వంటి విషయాలు ప్రస్తావించలేదు. నన్ను ఏమి చేయమంటావని నాన్నను అడిగినప్పుడు సమాజాన్ని అడుగు అనేవాడు. సమాజంలో తనకు తానే ప్రభావితమై సామాజిక కార్యకర్తగా విజయం సాధించారు. సమాజమే వ్యక్తిని మహోన్నత వ్యక్తిగా మార్చుతుందని నాన్న జీవితమే చెప్పింది. నాన్న కేవలం వృత్తిలోనూ, కుటుంబ సంరక్షకుడుగానే పరిమితం కాకూడదు. ప్రవర్తనలో సమాజానికి స్ఫూర్తిని నింపాలన్న మాటను పాటిస్తున్నాను.

డాక్టర్ చల్లా రవికుమార్, సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకులు, మండపేట

ఆదర్శప్రాయుడు నాన్న



నేడు చూసిన తొలి దైవం నాన్న. నాకే కాదు పేద, మధ్య తరగతి పిల్లలెందరికో నాన్న ఆదర్శమయ్యాడు. నాన్న గాద వీరవెంకట రమణ ప్రస్తుతం కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తున్నారు. ఆయన పని చేసిన ప్రదేశాల్లో ఉద్యోగ విధి నిర్వహణకే పరిమితం కాకుండా సామాజిక సేవ చేస్తుంటారు. హాస్టల్‌కు వచ్చినవారిని సంరక్షించడానికే పరిమితం కాకుండా చదువు పట్ల ఆసక్తి చూపని పేద పిల్లలను గుర్తించి వారికి మంచి చెడ్డలు చెప్పి పాఠశాలల్లో చేర్చి తన హాస్టల్‌లో సంరక్షించేవారు. ఆయన మాటలకు ప్రేరేపితుడినై బాగా చదువుకున్నాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2019లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. నాన్న స్ఫూర్తితో విసుగు చెందకుండా సామాన్యులకు సేవ చేస్తున్నాను.

గాద నవీన్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్, రామచంద్రపురం

తండ్రి పోత్సాహంతో ఊరికి సేవ చేస్తున్నాం



పడమర ఖండ్రికకు చెందిన నేను వార్డు సభ్యుడిగానూ, నా సతీమణి సర్పంచ్ గానూ సేవలందిస్తున్నాం. ఇద్దరమూ ప్రజాప్రతినిధులుగా మరి సేవలందించడం వెనుక మా నాన్న ప్రోత్సాహం ఉంది. నా తండ్రి పెద సత్యనారాయణ పాడి పశువుల వ్యాపారం చేస్తూ గ్రామంలో మంచి పేరు సంపాదించారు. మా సతీమణి ఆదిలక్ష్మి తండ్రి సత్యనారాయణ వ్యవసాయం చేసేవారు. మా ఇద్దరి నాన్నలూ గ్రామం పట్ల ఆసక్తి కలిగి ఉండేవారు. గ్రామ ప్రజలతో మంచిగా నడుచుకునేవారు. గ్రామానికి ఏదైనా మేలు చేయాలన్న తపనతో ఉండేవారు. ఆ ఆలోచనల నుంచే ఎన్నికల బరిలో నిలిచి ప్రజా ప్రతినిధులమయ్యాం. గ్రామాన్ని విశేషంగా అభివృద్ధి చేశామన్న సంతృప్తి ఉంది.

తిరునాతి వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతులు, సర్పంచ్, పడమర ఖండ్రిక

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రామలక్ష్మణమూర్తి

రాయవరం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని ఎంఈఓ పి.రామలక్ష్మణమూర్తి కోరారు. మండలంలోని ఉపాధ్యాయ సంఘాలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులకు సంఘ నాయకులు సహకరించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో హిందీ పండిట్లు లేనందున, హిందీ ఉపాధ్యాయుల నియామకానికి తగిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. నాడు-నేడు ఫేజ్-2 పాఠశాలల్లో పనులు పూర్తి చేయడానికి తగిన నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, తన పరిధిలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానని రామలక్ష్మణమూర్తి హామీ ఇచ్చారు. యూటీఎఫ్ నేతలు జి.మురళీకృష్ణ, నల్లమిల్లి భాస్కరరెడ్డి, ఎస్‌టీయూ నేతలు పంపన వీరవెంకటరమణ, రాయవరపు భాస్కరరావు, పీఆర్‌టీయూ నేత గుంటూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని సమష్టిగా అభివృద్ధి చేద్దాం

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: సమష్టి కృషితో మండపేట పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందాం అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి చాంబర్‌లో ఎమ్మెల్యే అధికారులు, సచివాలయ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. పట్టణంలోని సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. పన్నుల వసూళ్లు, శానిటేషన్‌పై సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలోని 14 సచివాలయాలు ఉన్నా పారిశుధ్య నిర్వహణలో వెనకబడి ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే పనులు పూర్తయిన డ్వాక్రా, క్రిస్టియన్ కమ్యూనిటీ భవనాలను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయని, ఆ పనులు పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచాక తొలిసారిగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయనను చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, అధికారులు ఘన స్వాగతం పలికి పుస్తకాలను అందించారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి, వైస్ చైర్మన్లు వేగుళ్ల నారాయణరావు, పిల్లి గనేశ్వరరావు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించారు. సమావేశంలో కమిషనర్ బొడ్డేపల్లి రాము, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వరప్రకాష్, డీఈ శ్రీనివాసరావు, ఏఈలు సత్యనారాయణ, పవన్ కుమార్, మేనేజర్ కనకరాజు, ఆర్వో జీవీఎస్ శాస్త్రి, ఆర్ఐలు వంక ప్రభాకర్ చౌదరి, శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభాకరరావు సేవలు అమోఘం



ప్రభాకరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: ఆంగ్ల ఉపాధ్యాయుడిగా జీవీవీ ప్రభాకరరావు అందించిన సేవలు అమూల్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన ప్రభాకరరావుకు శనివారం పాఠశాలలో హెచ్‌ఎం డి.సత్తిరాజు అధ్యక్షతన సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు పోలిశెట్టి రాంబాబు, నూలు ఆదినారాయణ, డి.ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడుతూ నిత్యం విద్యార్థులతో మమేకమై, బోధనలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న ప్రభాకరరావు సేవలు నిరుపమానం అన్నారు. ప్రభాకరరావు ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ఆయన సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ప్రభాకరరావును పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. చామకుర్తి శ్రీరామచంద్రమూర్తి చేసిన వ్యాఖ్యానం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శేషుబాబు, డి.తులసీదాసు, ఆర్ఎస్ఆర్ సాయిబాబా, పొక్కులూరి తిరుమలరావు, కందుల శ్రీనివాసరావు, పట్నాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: విద్యావ్యవస్థలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు చేసి విద్యాభివృద్ధికి బాటలు వేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక 20వ వార్డు వైఎస్సార్ కాలనీలోని ప్రాథమికోన్నత ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు శనివారం చైర్‌పర్సన్ దుర్గారాణి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దానిని కొనసాగించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సమస్యను గుర్తించి పరిష్కరించామన్నారు. మనబడి నాడు-నేడులో భాగంగా పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం పి.లక్ష్మి, నారాయణ మూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘విద్యా ప్రవేశ్’ను విజయవంతం చేయాలి

సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు



వాడపాలెంలో నాడు-నేడు పనులపై ఎంఈఓ హరిప్రసాద్‌తో సమీక్షిస్తున్న మధుసూదనరావు

కొత్తపేట: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) ఎ.మధుసూదనరావు ఉపాధ్యాయులకు సూచించారు. వాడపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన సందర్శించి, నాడు-నేడు పనులను పరిశీలించారు. ఆయా పాఠశాలలు, మండలంలో పాఠశాలల పనుల పురోగతిపై ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1,240 ప్రాథమిక, 86 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు 90 రోజులు పాటు విద్యాప్రవేశ్ అమలు చేయాలన్నారు. రోజువారీ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను అంకితభావంతో అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు చిన్నారులు స్కూళ్లలో ఉండేలా రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ‘నేను బడికి పోతా’ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ వరకూ ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాల పరిధిలో నిర్వహించాల్సి ఉందన్నారు. అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు పనులను పూర్తి చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపు



పార్వతీశ్వర ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: ఉద్యోగులకు సేవలే గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని మాచర బ్రాంచి పోస్ట్ మాస్టర్‌గా సేవలందించిన పార్వతీశ్వర ప్రసాద్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. కాగా పార్వతీశ్వర ప్రసాద్ దంపతులను శనివారం పోస్టల్ సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పోస్టల్ శాఖలో 36 సంవత్సరాల పాటు పార్వతీశ్వర ప్రసాద్ మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో సబ్ పోస్టు మాస్టర్ ప్రణీత్, రిటైర్డ్ సబ్ పోస్ట్ మాస్టర్ టపా పుల్లేశ్వరరావు, తపాల ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్‌వీ మునేశ్వరరావు, కోశాధికారి వి.కామేశ్వరి, అంగర పోస్టల్ అసిస్టెంట్ వి.జానకిరామ్, ఎన్ఎస్ పేట బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వి.వీరయ్య చౌదరి, రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ సలాది సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



రోగులకు హోమియో మందు వేస్తున్న సత్తి బులిస్వామిరెడ్డి

మండపేట: ఎస్బీఎస్సార్ ట్రస్టు ద్వారా గత 28 ఏళ్లుగా సత్తి బులిస్వామిరెడ్డి అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఆయన మనుమలు సత్తి బులిస్వామిరెడ్డి, సత్తి సాయిచరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అర్తమూరులో ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి నెలా పేదల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న ఘనత తమ తాతయ్యకే దక్కుతుందన్నారు. అనంతరం డాక్టర్ అల్లూరి రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల వైద్యులు ఉచిత వైద్య సేవలు అందించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ తాడి కోదండ రామారెడ్డి, డైరెక్టర్ సత్తి సత్యనారాయణరెడ్డి, ట్రస్ట్ సభ్యులు తాడి సుబ్బిరెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, చింతా వెంకట కృష్ణారెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి, కేబీఎస్ఎన్ రాజు, వెలగల శివారెడ్డి, జీవీఎస్ఎస్ మూర్తి, హోమియో వైద్యులు పాల్గొన్నారు.

వరి సాగుకు రాచబాట

- కాలిబాటలతో ప్రయోజనాలెన్నో..
- చీడపీడల నియంత్రణకు అవకాశం
- ఎరువుల నిర్వహణ సులభతరం



వరి చేలో కాలిబాటలు

రామచంద్రపురం రూరల్: ఊడ్పుల సమయంలో కాలి బాటలతో ఎన్నో ప్రయాజనాలున్నాయి. విత్తనాలను వెద జల్లడం, డ్రమ్ సీడర్‌ను ఉపయోగించి విత్తనాలను నాటడం వంటి సాగు విధానాల్లో ఏది చేసినా కాలిబాటలు తీయడం మరువకూడదు. వీటి కోసం రైతు పైసా ఖర్చు చేయకపోయినా, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఇవి దోహదపడతాయి. పంట కాలంలో రైతులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఈ కాలి బాటలు ఎంతగానో సహకరిస్తాయని రామచంద్రపురం మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. కాలి బాటలపై ఆయన మాటల్లోనే..

ఊడ్పుల్లో కాలి బాటలు ఇలా..

- వరినాట్లు వేసేటపుడు కాలి బాటలను వేయాలంటే ముందుగానే రెండు గట్ల మధ్య తాడు లాగి, ఆ ప్రదేశాన్ని వదిలి, మిగిలిన రెండు వైపులా మొక్కలు నాటాలి.
- చేలో విత్తనాలు వెదజల్లిన రైతులు కూడా కాలి బాటలు తీసుకోవచ్చు.
- విత్తనాలు చల్లిన 15 నుంచి 20 రోజుల్లోగా పైరు ఎదుగుతున్న సమయంలో బాటలు తీయవచ్చు.
- ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. వెడల్పులో మొక్కల్ని తొలగించాలి.
- డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసేటపుడు ఒక వరుస వేయడం పూర్తయ్యాక 20 సెం.మీ. స్థలాన్ని వదిలి, మరో వరుసలో విత్తనాలు వేసుకుంటే బాటలు ఏర్పడతాయి.

నాట్లు పూర్తయ్యాక బాటలు ఇలా..

- వరినాట్లు వేసిన తర్వాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. వెడల్పున కాలిబాట తీయాలి.
- నాట్లు వేసిన 12 నుంచి 16 రోజుల్లోపు కాలి బాట తీయడం ఉత్తమం.
- మందపాటి తాడును చేనుకు అవతలి గట్టున ఒకరు, ఇవతలి గట్టున మరొకరు పట్టుకుని లాగాలి.
- ఆ తాడు చివర్లను ఒక కట్టికు కట్టి గట్టుపై గుచ్చాలి.

– తాడుకు 20 సెం.మీ. దూరంలో సమాంతరంగా మరో తాడును ఇదే పద్ధతిలో ఏర్పాటు చేయాలి.

– రెండు తాళ్ల మధ్య ఉన్న ప్రదేశంలో వచ్చిన మొక్కల్ని తొలగించాలి.

- పైరు పలుచగా ఉన్నచోట ఆ మొక్కల్ని నాటుకోవచ్చు.

ఆమడ దూరంలో చీడపీడలు

- వరి దుబ్బులకు ఆశించి పైరుకు నష్టం కలిగించే బూడిద రంగు దోమ, తెల్లదోమ, పచ్చ దీపపు పురుగుల్ని సకాలంలో గుర్తించి, వెంటనే సంరక్షణ చర్యలు చేపట్టేందుకు ఈ బాటలు ఉపయోగపడతాయి.
- కాలి బాటలు ఉంటే పొలం నుంచి ఎప్పటికప్పుడు మురుగు నీటిని తీసేయడం సులువుగా ఉంటుంది. ఈ కారణంగా గొట్టాల పురుగు, నాము పురుగు ఉధృతి తగ్గుముఖం పడుతుంది. కాలి బాటల చివర్లలో పంగల కర్రలు కడితే, పక్షులు వాటిపైకి చేరి హానికారక కీటకాలను పట్టుకుని తినేస్తాయి.

బహుళ ప్రయోజనాలు

- కాలి బాటల విధానం వల్ల వరి పైరుకు గాలి, వెలుతురు పుష్కలంగా అందుతాయి.
- కిరణ జన్య సంయోగ క్రియ బాగా జరుగుతుంది.
- మొక్కల్లో పత్ర హరితం అధికంగా ఉత్పత్తి అవుతుంది.
- పంటకు ఎంత నీరు అవసరమో అంతమేరకే ఎప్పటికప్పుడు బాటలు అందిస్తాయి.
- సాగునేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా కుళ్లడానికి దోహదపడతాయి.
- మొక్కలకు మంచి పోషకాలు అందిస్తాయి.
- మంచి దిగుబడులు పొందేందుకు ముఖ్య భూమిక పోషిస్తాయి.
- పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుంది.
- గాలి సమృద్ధిగా మొక్కకు సోకడంతో కావలసినంత ఆక్సిజన్‌ను పొందేందుకు మొక్కలకు పెద్దగా ఖర్చు కాదు.
- కలుపు నివారణా మందులు పిచికారీ చేయడం సులువవుతుంది.
- ఎరువులకు పొలమంతా సమానంగా వేయడం తేలికవుతుంది.
- పొలమంతా తిరిగి, పైరు ఎదుగుదలను చూసుకునే అవకాశం కలుగుతుంది.

అంతర సేద్యం సులభమే..

వరిచేలో అంతర సేద్యానికి కాలిబాటలు ఎంతగానో దోహదపడతాయి. కూలీలతో కలుపు తీయించడానికి ఇవి బాగా అనువుగా ఉంటాయి. అనేక రకాల పురుగులకు ఆశ్రయమిచ్చే ఊద, తూటుకాడ వంటి కలుపు మొక్కల్ని తేలికగా తీసేయవచ్చు. చేలో ఎలుక బొరియల్ని గుర్తించడం, అవసరమైన నివారణ చర్యలు చేపట్టడం కూడా సులభమే. కేళీల్లో అరుదైన రకాల్ని కూడా కాలిబాటల వలన ఒత్తుగా ఉన్న మొక్కల్ని తీసి, పైరును పలచన చేయడం తేలికవుతుంది.



ఎస్. సత్యప్రసాద్, వ్యవసాయాధికారి, రామచంద్రపురం

కోత దశలో ఉపయుక్తం

వరికోత దశలో కూడా ఈ బాటలు ఎంతగానో రైతులకు ఉపయుక్తమవుతాయి. పంట కోత కోసే దశలో రైతులకు కలిగే నష్టాల్ని నివారిస్తాయి. పంట కోసేటప్పుడు వంగిపోయిన మొక్కల్ని నిలబెట్టే ప్రక్రియకు ఇవి దోహదపడతాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దుబ్బులు నేలకు ఒరిగితే వాటిని నిలబెట్టుకోవచ్చు. ఈ బాటలు లేకపోతే పంట రాపిడికి గింజలు రాలిపోతాయి. కోత ఖర్చు కూడా పెరుగుతుంది.